PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం

నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో

అన్ని జిల్లాల్లో విలేకర్లుగా పనిచేయుటకు

జర్నలిస్టులు కావలెను

సంప్రదించాల్సిన నెంబర్స్

9014726022,6302041083

మంగళవారం SATURDAY 09.09.2025

కరీంనగర్ KARIMNAGAR

పేజీలు : 4 pages : 4

సంపుటి :1 || సంచిక :05 | ధర : 4.00

విదియ

మంగళవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: విదియ రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT : WARANGAL, HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHIDINAPATRIKA.COM

## నెత్తి మీద నీళ్లు చల్లుకుంటే

# చేసిన పాపాలు పోవు



**హైదరాబాద్, సెప్టెంబర్ ,మేకార్తి దినపత్రిక**

నిజాం సర్కార్ దూరదృష్టితో జంట జలాశయాలను నిర్మించడం వల్లే నగరానికి వచ్చిన వాళ్లకు తాగునీరు అందుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు హైదరాబాద్ సమీపంలోని గండిపేట వద్ద గోదావరి ఫేజ్ 2, 3కి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా హైదరాబాద్ జల మండలి ఆధ్వర్యంలో నిర్మించిన 16 జలాశయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆనాటి మున్సిపల్ మంత్రి శామీర్‌పేట వద్ద గోదావరి నీళ్లు నెత్తి మీద చల్లుకున్నారని గుర్తు చేశారు. నెత్తి మీద నీళ్లు చల్లుకుంటే మీరు చేసిన పాపాలు ఎక్కడికి పోవంటూ బీఆర్ఎస్ నేతలకు ఆయన చురకలంటించారు. మూసీ నదిలో ప్రవహించే నీరు విషంగా మారి పశువులు, మనుషుల ప్రాణాలు తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది నల్గొండకు విషాన్ని మోసుకెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఎవరు ఏమన్నా మూసీ నది ప్రక్షాళన చేస్తున్నామని స్పష్టం చేశారు.

హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేందుకే ఈ ప్రాజెక్టు అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లోనే హైదరాబాద్‌కు గొప్ప పేరుందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏడాదికి 3 శాతం జనాభా హైదరాబాద్‌కు వలస వస్తోందని గణాంకాలతో సహా వివరించారు. తాగు నీటి అవసరాలు అంతకంతకూ పెరుగుతున్నాయని చెప్పారు. వేసవి వచ్చిందంటే సచివాలయం ఎదుట నిరసనలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ పోరాటంతోనే హైదరాబాద్‌కు మంజీరా జలాలు వచ్చాయన్నారు.

హైదరాబాద్‌కు దాహార్తి తీర్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు సీఎం రేవంత్ రెడ్డి. నల్గొండ ప్రజల కోరిక మేరకే మూసీ ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు. మూసీ ప్రక్షాళనపై ఎవరు అడ్డం పడ్డా ముందుకెళ్తున్నామన్నారు. మూసీ కాలుష్యం నుంచి నల్గొండ ప్రజలకు విముక్తి కల్పిస్తామని చెప్పారు. మూసీలో హైదరాబాద్ డ్రైనేజీ కలవకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్‌కు తాగునీరు అందుతుందన్నారు. నల్గొండ ఫ్లోరైడ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కొందరు తాటిచెట్టులా పెరిగినా బుద్ధి మాత్రం పెరగలేదంటూ ప్రతిపక్ష నేతకు చురకలంటించారు. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు తీసుకు రావట్లేదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే హైదరాబాద్‌కు గోదావరి జలాలు వస్తున్నాయని వివరించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రాణహిత-చేవెళ్లతో రంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. త్వరలో మహారాష్ట్ర వెళ్లి అక్కడి సీఎంతో మాట్లాడతానన్నారు. తుమ్మడిహట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణంపై వారితో చర్చలు జరుపుతామని తెలిపారు. పదేళ్లలో మూసీ ప్రక్షాళనపై కేసీఆర్ ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళన హైదరాబాదులో ఎందుకు చేసుకోకూడదంటూ ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మోదీ, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా తమ తమ రాష్ట్రాల్లోని నదులను ప్రక్షాళన చేసుకోవచ్చా? అంటూ వ్యంగ్యంగా బీజేపీ నేతలను ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందనే వారి భయమన్నారు. మూడు నెలల్లో ప్రపంచ నగరాల్లో హైదరాబాద్‌ను మేటిగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

కాంగ్రెస్ సీఎంల ప్రణాళికల వల్లే హైదరాబాద్ ఈ స్థాయికి చేరుకుందని వివరించారు. కడుపులో విషం పెట్టుకుని ప్రాజెక్టులు ఆపకండంటూ ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. కలిసి రండి.. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం తిప్పికొడుతుందన్నారు.మూసీ పునరుజ్జీవ పథకానికి శ్రీకారంలో భాగంగా ఈ రోజు.. గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను మంచినీటితో నింపేలా ప్రణాళికలు రూపొందించారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ పథకాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.7,658 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపడుతుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

## రాజా సింగ్ స్ట్రాంగ్ రియాక్షన్




**హైదరాబాద్, సెప్టెంబర్, మేకార్తి దినపత్రిక**

తెలంగాణ రాష్ట్ర బీజేపీ కమిటీలో గోషా మహల్ నియోజకవర్గానికి చోటు దక్కక పోవడంపై గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందించారు. భారతీయ జనతా పార్టీ గౌరవాన్ని గోషా మహల్ నియోజకవర్గానికి చెందిన కార్యకర్త మూడు సార్లు కాపాడారని గుర్తు చేశారు. అలాంటి నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్తను రాష్ట్ర కమిటీలో నియమించడానికి మీకు ఏ ఒక్కరూ కనిపించలేదా? అంటూ ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ ఒకే ఒక్క అసెంబ్లీ స్థానాన్ని గెలిచుకుందని గుర్తు చేశారు రాజాసింగ్. అలాంటి గోషామహల్‌లోని బీజేపీ కార్యకర్తలను మరిచిపోయారా? అంటూ పార్టీ అగ్రనాయకత్వానికి చురకలు అంటించారు. ఇంకా ఎన్ని సంవత్సరాలు బీజేపీ కార్యకర్తలను దూరంగా ఉంచి వారికి అన్యాయం చేస్తారంటూ పార్టీ అగ్రనాయకత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర కమిటీలో 12 మంది సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి నుంచే ఉన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అంటే.. ఇది రాష్ట్ర కమిటీనా? లేకుంటే సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీనా? అనేది అర్థం కావడం లేదంటూ ఎమ్మెల్యే రాజా సింగ్ సందేహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కమిటీని ప్రకటించిన చీఫ్..

కాగా, తెలంగాణ బీజేపీ కమిటీని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సోమవారం ప్రకటించారు. ఈ కమిటీని 22 మందితో ఏర్పాటు చేశారు. ఏడు మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను ఈ సందర్భంగా ప్రకటించారు. ఎనిమిది మంది వైస్ ప్రెసిడెంట్లు, ముగ్గురు జనరల్ సెక్రటరీలు, ఏడుగురు సెక్రటరీలు, కోశాధికా రులు, సంయుక్త కోశాధికారులు, ముఖ్య అధికార ప్రతినిధిలను నియమించారు.

పార్టీ ప్రధాన కార్యదర్శులు: వీరేందర్ గౌడ్, గౌతం రావు, వేముల అశోక్

కార్యదర్శులు: ఓ.శ్రీనివాస్ రెడ్డి, కొప్పు బాషా, బండారు విజయ లక్ష్మి, స్రవంతి రెడ్డి, పరిణిత, బద్దం మహిపాల్

ఉపాధ్యక్షులు: బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, కొల్లి మాధవి, జయశ్రీ, కళ్యాణ్ నాయక్, రఘునాథరావు, బండ కార్తీక రెడ్డి

కోశాధికారి: వాసుదేవ్

మహిళా మోర్చా అధ్యక్షురాలు: శిల్పా రెడ్డి

యువ మోర్చా అధ్యక్షుడు: గణేష్

బీసీ మోర్చా అధ్యక్షుడు: ఆనంద్ గౌడ్

కిసాన్ మోర్చా అధ్యక్షుడు: లక్ష్మీ నర్సయ్య

ఎస్సీ మోర్చా అధ్యక్షుడు: కాంతి కిరణ్

ఎస్టీ మోర్చా అధ్యక్షుడు: రవి నాయక్

అయితే ఈ కమిటీలో అత్యధిక సంఖ్యలో పదవులు పొందిన వారు సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వారే కావడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ కమిటీ ప్రకటించిన కొన్ని నిమిషాలకే గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పందించారు. అదీకాక ఇటీవల రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సైతం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానీ ఆయన్ని కార్యాలయంలోనికి అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన రాజా సింగ్.. బీజేపీకి రాజీనామా చేశారు. అదే సమయంలో.. రాష్ట్రంలోని బీజేపీ నేతలపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించిన విషయం విదితమే. ఇక రాజా సింగ్ రాజీనామా లేఖను పార్టీ అగ్రనాయకత్వం వెంటనే ఆమోదించిన సంగతి తెలిసిందే

## ఆలయాల అభివృద్ధిపై సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్,,మేకార్తి దినపత్రిక**

మేడారం అభివృద్ధి పనులు 100 రోజుల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మహా జాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సోమవారం నాడు హైదరాబాద్‌లో మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారం, బాసర ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌లను సీఎంకు ఉన్నతాధికారులు వివరించారు.

అలాగే మేడారం అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సైతం సీఎం రేవంత్ పరిశీలించారు. ఆ తర్వాత ఆదేశాలు జారీ చేశారు. అలాగే పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్‌తోపాటు పార్కింగ్ వసతులు ఉండాలని సూచించారు. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా ఏరియాల వారీగా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ వారంలో మేడారానికి వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని అధికారులకు సీఎం రేవంత్ తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ,అభివృద్ధికి సంబంధించి ఈ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు.

అన్ని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించడంతోపాటు, స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని వారికి సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మరోవైపు సోమవారం.. గండిపేట వద్ద గోదావరి ఫేజ్ 3కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ జల మండలి ఆధ్వర్యంలో నిర్మించిన 16 జలాశయాలను సీఎం ప్రారంభించారు. అలాగే నియో పోలీస్ వాటర్ సేవరేజ్ ప్రాజెక్ట్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో

## బీఆర్ఎస్ ఓటు ఎటువైపు



**హైదరాబాద్, సెప్టెంబరు మేకార్తి దినపత్రిక :**

కేంద్రప్రభుత్వం యూరియా ఇవ్వలేదని.. ఇప్పుడు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు ఎటువైపో చెప్పాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంపై బీజేపీ బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత వచ్చిందని ఆరోపించారు.

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావుకి ఎరువుల గురించి ఏమీ తెలియదని విమర్శించారు. రాంచందర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఆయనకు రాజకీయ విమర్శలు తప్పా, రైతుల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. యూరియా కోసం ఎప్పుడైనా కేంద్ర ప్రభుత్వాన్ని అడిగారా..? అని నిలదీశారు.

సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు, ఎంపీలు యూరియాపై కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలసి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. యూరియా ఉత్పత్తి, సరఫరా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని చెప్పుకొచ్చారు. ఇవాళ(సోమవారం) గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు పాజిటివ్‌గా ఉన్నారని ఉద్ఘాటించారు.

రాష్ట్రంలో యూరియా కొరత ఉందని.. దాన్ని ఆసరాగా చేసుకుని బీజేపీ, బీఆర్ఎస్‌లు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఆపేశారని గుర్తుచేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు యూరియా కొరతకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు పొన్నం ప్రభాకర్.

యూరియా సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల అంశంపై సంబంధిత కేంద్ర మంత్రి స్పందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున పోరుబాట పడుతామని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# జాతీయం

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరం



**న్యూఢిల్లీ: మేకార్తి దినపత్రిక**

ఉప రాష్ట్రపతి ఎన్నికల కు దూరంగా ఉండనున్నట్లు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ ప్రకటించింది. మంగళవారంనాడు జరుగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు తమ పార్టీ ఎంపీలు దూరంగా ఉంటారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సస్మిత్ పాత్ర ఢిల్లీలో తెలిపారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండియా' కూటమికి తమ పార్టీ సమానదూరం పాటించాలనే విధానంలో భాగంగా పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పార్టీ సీనియర్ నేతలు, పొలిటికల్ ఆఫైర్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలతో బిజా పట్నాయక్ సంప్రదించిన తర్వాతే ఓటింగ్‌కు దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. బిజూ జనతాదళ్‌కు రాజ్యసభలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు.

కాగా, ఇప్పటికే ఈ ఎన్నికలకు దూరంగా ఉండనున్నట్టు భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతపై తమ ఆందోళనను తెలియజేసేందుకు, రైతులకు మద్దతుగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలిపారు. రైతుల సమస్యను బీజేపీ, కాంగ్రెస్ పరిష్కరించాలన్నారు. బీఆర్ఎస్‌కు పార్లమెంటులో నలుగురు సభ్యులు ఉన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పోటీ చేస్తుండగా, విపక్ష 'ఇండియా' కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు.

ఓటింగ్ సమయం

ఉపరాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. సాయంత్రం 5 గంటలతో ముగుస్తుంది. ఓట్ల లెక్కింపు సాయంత్రం 6 గంటలకు మొదలవుతుంది. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు. రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు, 12 నామినేటెడ్ సభ్యులు, లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. బలాబలాల ప్రకారం, 542 మంది సభ్యుల లోక్‌సభలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు 293 మంది సభ్యులు, రాజ్యసభలో 129 మంది సభ్యుల బలం ఉంది. ఉభయసభల్లోని 786 మంది ఎంపీలు ఉండగా, 394 ఓట్లు సాధించిన అభ్యర్థిని విజయం వరిస్తుంది. ఆ ప్రకారం 422 మంది సభ్యుల మద్దతుతో ఎన్డీయే విజయం సాధించే అవకాశాలు బలంగా ఉన్నాయి.

## ఆధార్‌ను అంగీకరించాల్సిందే

### ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశం



**న్యూఢిల్లీ: మేకార్తి దినపత్రిక**

బిహార్‌లో ఎన్నికల కమిషన్ కొనసాగిస్తున్న ఎస్ఐఆర్ డ్రైవ్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల జాబితాలో ఓటరుగా నమోదుకావడానికి 12వ నిర్దేశిత డాక్యుమెంట్‌గా ఆధార్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆధార్‌ను గుర్తించేందుకు ఈసీ అధికారులు నిరాకరిస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంపై అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలిచ్చింది.

ఆధార్‌ను విలువైన ఐడెంటిటీ ప్రూఫ్‌గా పరిగణించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఆధార్ ప్రామాణికత, వాస్తవికతను పరీక్షించే అధికారం అధికారులకే అప్పగిస్తున్నామని తెలిపింది. ఫీల్డ్ ఆఫీసర్లకు ఈ మేరకు వెంటనే ఆదేశాలివ్వాలని న్యాయమూర్తులు సూర్య కాంత్, జోయ్‌మాల్యా బాగ్జితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. పౌరసత్వం, వయస్సు నిర్ధారణ వంటి విషయాలలో ఆధార్‌ను కచ్చితమైన లేదా ఏకైక ఆధారంగా పరిగణించలేమని కూడా ధర్మాసనం పేర్కొంది. బిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఆర్జేడీ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ తన వాదనలు వినిపించారు. ఆధార్‌ను ఉద్దేశపూర్వకంగానే ఈసీఐ మినహాయిస్తోందన్నారు. 11 నోటిఫైడ్ డాక్యుమెంట్లను మినహా వేటినీ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు అంగీకరించడం లేదని చెప్పారు. ఆధార్ వంటి యూనివర్శల్ డాక్యుమెంట్‌ను నిరాకరిస్తే ఇంక్ల్యూజివ్ ఎక్సర్‌సైజ్ అనే మాటకు అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ, కేవలం 'ఆధార్' ఆధారంగానే ఓటర్ స్టాటస్‌ను నిర్ధారించాలని పిటిషన్ల అభిప్రాయమా అని ప్రశ్నించారు. దీనికి సిబల్ సమాధానమిస్తూ, తాను 2025 ఎన్నికల జాబితాలో ఉన్నానని, ఇంక ప్రూవ్ చేసుకోవడం అనే ప్రశ్న ఎలా తలెత్తుందని అన్నారు. బీఎల్ఓలు తన పౌరసత్వాన్ని నిర్ధారించలేరని పేర్కొన్నారు.

కోర్టులో కమిషన్ చెబుతున్న దానికి, గ్రౌండ్ లెవెల్లో అధికారులకు ఇస్తున్న ఆదేశాలకు మధ్య గ్యాప్ కనిపిస్తోందని బెంచ్ అభిప్రాయపడింది. తాము ఆదేశాలిచ్చినప్పటికీ ఆధార్ అక్కరలేకుండా 11 డాక్యుమెంట్లనే ఎందుకు కాపీలో ప్రస్తావిస్తున్నారని నిలదీసింది. దానికి ఈసీఐ తరఫు న్యాయవాది రాకేష్ ద్వివేదీ సమాధానమిస్తూ, ఎక్కడైనా పొరపాటు జరిగిందేమో చూస్తానని, ఆధార్ అంగీకరించాలనే కోర్టు ఇచ్చిన గత ఆదేశాలను కమిషన్ పబ్లిష్ చేసిందని చెప్పారు.

# ఏసీ పేలుడు..

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి




**డెస్క్ , మేకార్తి దినపత్రిక**

ఏసీ పేలుడు.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృఏసీ పేలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కుటుంబసభ్యులతో పాటు వారి కుక్క కూడా ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన హర్యానాలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఫరీదాబాద్‌కు చెందిన సచిన్ కపూర్ అనే వ్యక్తి తన భార్య రింకు కపూర్, కూతురు సుజన్ కపూర్, కొడుకుతో పాటు మరో ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి నాలుగు అంతస్తుల బిల్డింగులో నివాసం ఉంటున్నాడు.

ఆ ఫ్యామిలీ మొత్తం నాలుగవ అంతస్తులో నివసిస్తోంది. మూడో అంతస్తును సచిన్ తన ఆఫీస్‌గా వాడుకుంటున్నాడు.ఆదివారం రాత్రి సచిన్, రింకు, సుజన్, పెంపుడు కుక్క రెండవ అంతస్తులోని ఓ గదిలో నిద్రపోతూ ఉన్నారు. సచిన్ కొడుకు మరో గదిలో నిద్రపోతున్నాడు. సోమవారం తెల్లవారుజామున మొదటి అంతస్తులోని ఏసీ కంప్రెసర్ పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ రెండో అంతస్తులోకి పాకింది. నిద్రలో ఉన్న సచిన్, రింకు, సుజన్ ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయారు. పెంపుడు కుక్క ప్రాణాలు కూడా పోయాయి. మరో గదిలో నిద్రపోతున్న సచిన్ కొడుకు పొగ కారణంగా నిద్రలేచాడు. పొగనుంచి తనను తాను కాపాడుకోవడానికి రెండవ అంతస్తునుంచి కిందకు దూకేశాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు పెద్ద ఎత్తున ఇంటి దగ్గరకు చేరుకున్నారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గాయాలపాలైన సచిన్ కొడుకును ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సాయంతో మంటల్ని ఆర్పారు. పోలీసులు రెండవ అంతస్తులోకి వెళ్లి చూడగా ముగ్గురు చనిపోయి కనిపించారు. మూడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 13 గంటలు ఆలస్యంగా లాల్‌బాగ్చా

### రాజా వినాయక నిమజ్జనం



**ముంబై , మేకార్తి దినపత్రిక**

ముంబైలోని ప్రఖ్యాత లాల్ బాగ్చా రాజా గణపతి నిమజ్జనం ఆదివారం రాత్రి 10.30 గంటలకు గిరిగావ్ చౌపాటీ వద్ద జరిగింది. అయితే ప్రతిసారి ఆనవాయితీగా వస్తున్న నిమజ్జన సమయానికి సుమారు 13 గంటలు ఆలస్యంగా నిమజ్జనం చేశారు. దీనిపై కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేయగా, పున్నమి ఆటుపోట్లు కారణంగా ఆలస్యం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

సంప్రదాయ ప్రకారం 18 అడుగులు ఎత్తైన లాల్ బాగ్చా రాజా గణేష్ విగ్రహం ఊరేగింపు అనంత చతుర్దశి రోజున ప్రారంభమవుతుంది. మరుసటి ఉదయం 9 గంటల సమయంలో విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ఈసారి కూడా అనుకున్న సమయానికే ప్లాన్ చేశారు. అయితే అనుకున్న సమయానికి మాత్రం నిమజ్జనం చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. పున్నమి కావడంతో సముద్రంలో ఆటుపోట్లు ఉండటంతో ఆదివారం రాత్రి 10.30 నిమిషాలకు నిమజ్జనం చేశారు. అయితే ఆ సమయం సూతక ముహూర్తమని, అది శుభప్రదం కాదని కొందరు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాగా, ఈసారి మరో సంప్రదాయాన్ని కూడా నిర్వాహకులు పక్కనపెట్టేశారు. ప్రతిసారి మత్స్యకారుల ఫ్లోటింగ్ పడవలతో గణపతి నిమజ్జనం చేసేవారు. ఈసారి నిమజ్జనం కోసం హై-టెక్నలాజికల్ ఫ్లాట్‌ఫాం ఉపయోగించారు. ఈ ఫ్లాట్‌ఫాంలో కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తడంతోనూ నిమజ్జన కార్యక్రమంలో జాప్యానికి కారణమైంది. గిర్‌గావ్ చౌపాటీ వద్ద కొద్ది గంటల సేపు విగ్రహం నిలిచిపోయింది. దీనిపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికలో

### తొలి ఓటు వేసేది ఎవరంటే

**న్యూఢిల్లీ: మేకార్తి దినపత్రిక**

బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండియా' కూటమిప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం నాడు జరగనుంది. ఈ ఎన్నికలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేయనున్నారు. పంజాబ్, హర్యానా ఎంపీలతో కలిసి ప్రధాని తన ఓటు హక్కును వినియోగించుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండేలను ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ఎలక్షన్ ఏజెంట్లుగా నియమించారు. ఎన్డీయే ఎంపీలకు మోదీ డిన్నర్ మరి కొద్ది గంటల్లో ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీయే ఎంపీలకు సోమవారం రాత్రి 8 గంటలకు డిన్నర్ ఇస్తున్నారు. ఓటింగ్ సందర్భంగా ఎంపీల మధ్య పూర్తి సమన్వయం, ఐక్యతకు ఈ తరహా విందు సమావేశాలు ఎంతో ఉపకరిస్తుంటాయని ఎన్డీయే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ఎన్డీయే భాగస్వాముల నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు.


పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్,



ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి మధ్య ముఖాముఖీ పోరు నెలకొంది. ఉభయసభల్లోని ఎంపీలు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలోని 64, 68 అధికరణలోని నిబంధనల కింద ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతోంది. ఈ ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నోటిఫై చేసింది. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరగనుంది

# అంతర్జాతీయం

## భారత దౌత్య వ్యూహంపై అమెరికా ప్రొఫెసర్ ప్రశంసలు



**ఇంటర్నెట్ డెస్క్ మేకార్తి దినపత్రిక**

యూనివర్సిటీ ఆఫ్ చికాగో పొలిటికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ జాన్ మార్షిమర్ భారత్‌పై ప్రశంసలు కురిపించారు. అమెరికా ఒత్తిళ్లు, సుంకాలను భారత్ ఎదుర్కొంటున్న తీరులో చాకచక్యం కనిపిస్తుంటే అమెరికా చర్యలన్నీ తప్పుల తడకగా మారాయని అన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ కామెంట్స్ చేశారు భౌగోళిక రాజకీయ వ్యూహాల కోణంలో చూస్తే అమెరికా ప్రభుత్వ చర్యలు అర్థరహితంగా కనిపిస్తున్నాయి. ఆర్థికంగా, సైనిక శక్తి పరంగా చైనా అమెరికాకు శక్తిమంతమైన ప్రత్యర్థి. ఇలాంటి సందర్భాల్లో భారత్, రష్యాలతో సత్సంబంధాలు కొనసాగించాలి. వారు చైనాకు దగ్గర కాకుండా జాగ్రత్త పడాలి. కానీ ట్రంప్ ప్రభుత్వం మాత్రం రష్యన్‌లతో చెడుగా వ్యవహరిస్తూ, భారత్‌పై 50 శాతం సుంకం విధించి, నోటికొచ్చినట్టు తూలనాడుతూ చైనా వైపు మళ్లేలా చేస్తోంది'

'ప్రస్తుత పరిస్థితుల్లో భారత్, రష్యాలతో అమెరికా స్నేహం చేయాలి. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. మన అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు ఎంతమాత్రం అనుకూలం కాదు. ఇదంతా చూస్తే అమెరికన్లు, డొనాల్డ్ ట్రంప్ ఏం ఆలోచిస్తున్నారో అర్థంకాక నెత్తి బాదుకోవాల్సి వస్తోంది'

'ఇప్పటికే రష్యా, చైనా, ఉత్తరకొరియా, ఇరాన్ దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా ఏకమవుతున్నాయి. ఇప్పుడు ఇండియా కూడా వారి వైపు మళ్లేలా చేశారు. అమెరికా ప్రయోజనాలకు ఇది విఘాతం'

భారతీయులు ఎప్పటి నుంచో ఈ దౌత్య క్రీడను కొనసాగిస్తున్నారు. ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో కూడా వారు ఇదే వ్యూహం కొనసాగించారు. అలీన విధానంలో వారు అటు రష్యా గానీ ఇటు అమెరికా కూటమిలో గానీ చేరలేదు. సమదూరం పాటించారు. ఈ మధ్య అమెరికాతో క్లోజ్‌గా ఉన్నా ట్రంప్ దూకుడు తరువాత చైనాకు కాస్త క్లోజ్ అయినట్టు కనిపిస్తున్నారు. కానీ ఇండియన్స్ చాలా స్మార్ట్. ఎవరితోనూ అతిగా దగ్గరవ్వకూడదని వారికి తెలుసు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ప్రపంచం కొంత సింపుల్‌గా ఉండేది. రష్యా, లేదా అమెరికా పక్షాన చేరాల్సి వచ్చేది. భారత్ లాంటి దేశాలు తటస్థంగా ఉన్నప్పటికీ స్థూలంగా ఎవరోకరికి మద్దతుగా ఉండాల్సి వచ్చేది. ఆ జమానా పోయింది' అని ఆయన అన్నారు.

## అట్టుడికిన ఆందోళనలు

### నేపాల్ హోం మంత్రి రాజీనామా



**కాఠ్‌మాండు: మేకార్తి దినపత్రిక**

నేపాల్‌లో యువత చేపట్టిన నిరసనల్లో కాఠ్‌మాండు సహా వివిధ ప్రాంతాల్లో 19 మంది ప్రాణాలు కోల్పోగా, 347 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నేపాల్ హోం మంత్రి రమేష్ లేఖక్ రాజీనామా చేశారు. ఆందోళనల్లో ఊహించలేనంత నష్టం జరిగిందని కాంగ్రెస్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ తీవ్ర విమర్శలు రావడంతో ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

రమేష్ లేఖక్ తన రాజీనామాను ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలికి అందజేశారు. యువత ఆందోళనలపై ప్రధాని అత్యవసరంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో హోం మంత్రి తన రాజీనామా అందజేసినట్టు సీనియర్ మంత్రి ఒకరు తెలిపారు. సోషల్ మీడియాపై విధించిన నిషేధం, ప్రభుత్వ అవినీతి ఆరోపణలకు వ్యతిరేకంగా వివిధ నగరాల్లో చోటుచేసుకున్న నిరసనలు కాఠ్‌మాండు సహా పలు చోట్లు హింసాత్మకంగా మారాయి.

ప్రధాని రాజీనామాకు ఆర్ఎస్‌పీ డిమాండ్

కాగా, నేపాల్ నిరసనల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడానికి నైతిక బాధ్యత వహించి ప్రధానమంత్రి రాజీనామా చేయాలని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (%=్రా%) డిమాండ్ చేసింది. నిరసనకారులపై అత్యంత పాశవికంగా ప్రభుత్వం విరుచుకుపడటాన్ని ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి కబీంద్ర బుర్లకోటి ఖండించారు. ప్రభుత్వం ఇంకెంతమాత్రం గద్దెపై ఉండే నైతికత, చట్టబద్ధత కోల్పోయిందన్నారు. తక్షణం నేషనల్ ఎలక్షన్స్ జరపాలని డిమాండ్ చేశారు.

## గెలుపుపై ఎవరి ధీమా వారిదే

న్యూఢిల్లీ: దేశ 17వ ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటు కొత్త భవనంలో ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 5 గంటలతో పోలింగ్ ముగుస్తుంది. 6 గంటలకు ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ (%జూ =ఖఎష్ట్రఖఎతీఅంష్ట్రఖఅ%), కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండియా' కూటమి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు. ఓటింగ్‌కు ముందు సీపీ రాధాకృష్ణన్ లోధి రోడ్ ప్రాంతంలోని శ్రీరామ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. భారత జాతీయవాదం పెద్ద విజయం సాధించనుందని రాధాకృష్ణన్ ఈ సందర్భంగా అన్నారు. 'మనమంతా ఒకటి, ఒకటిగానే ఉంటాం, ఇండియా వికసత్ భారత్ కావాలన్నదే అందరి అభిమతం' అని ఆయన అన్నారు.

ఉపరాష్ట్రపతి పదవికి వన్నెతెస్తారు: మోదీ

ఎన్డీయే అభ్యర్థిగా రాధాకృష్ణన్ అభ్యర్థిత్వంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.ఢిల్లీలో జరిగిన ఎన్డీయే సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాధాకృష్ణన్ అత్యద్భుతమైన ఉపరాష్ట్రపతి అవుతారని,పదవి ఔన్నత్యాన్ని పెంచుతారని దేశ ప్రజలంతా విశ్వసిస్తున్నట్టు తెలిపారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ఉప రాష్ట్రపతి అభ్యర్థి గెలుపునకు 391 ఓట్లు అవసరం కాగా, ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌కు కనీసం 437 మంది సభ్యుల బలం (56 శాతం) కనిపిస్తోంది. దీంతో ఆయన



గెలుపు నల్లేరు మీద నడకే కానుందనే అంచనాలు ఉన్నాయి. బి.సుదర్శన్ రెడ్డికి 323 ఓట్ల వరకూ రావచ్చని అంచనా. కాగా, తమ అభ్యర్థుల గెలుపుపై ఎన్డీయే, ఇండియా కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భారీ మెజారిటీతో ఎన్డీయే అభ్యర్థి గెలువనున్నట్టు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన విజయానికి అన్ని ప్రయత్నాలు చేసినట్టు చెప్పారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఆయన అభ్యర్థిత్వానికి విపక్ష సభ్యులు మద్దతు తెలిపితే స్వాగతిస్తామని అన్నారు. 100 శాతం రాధాకృష్ణన్ విజయం ఖాయమని బీజేపీ ఎంపీ రామ్‌భాయ్ మోకరియా అన్నారు. విపక్ష అభ్యర్థి గెలువబోవడం లేదన్నారు. గెలుపునకు అవసరమైన దానికంటే ఎక్కువ సంఖ్యా ఎన్డీయేకు ఉందని బీజేపీకి చెందిన మరో ఎంపీ అనంత్ నాయక్ అన్నారు. దేశానికి తదుపరి ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఖాయమని చెప్పారు. తమ అభ్యర్థిగా అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరగవచ్చని ఆ పార్టీకి చెందిన మరో ఎంపీ ప్రదీప్ పురోహిత్ అన్నారు.

బలపరచండి: సుదర్శన్ రెడ్డి

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలని ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి పార్లమెంటు సభ్యులను కోరారు. జాతీయ ఆత్మను ప్రతిబించేలా ఆలోచించి ఓటు వేయాలని అభ్యర్థించారు.

# ధైర్యంగా ఉండండి అండగా ఉంటా



## ఎమ్మెల్యే డా పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ

**మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్**
**చేర్యాల ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్**

చేర్యాల బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముస్తాల నాగేశ్వర రావు రోడ్డు ప్రమాదం లో గాయ పడ్డారు .ఈ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డా, పల్లా రాజేశ్వర్ రెడ్డి నాగేశ్వర రావు కి ఫోన్ చేసి పరామర్శించారు అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని త్వరలో బాగుపడతారని అన్నారు. మెరుగైనా వైద్య కోసం అన్ని విధాలుగా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులకు వెనకాడవద్దని మెరుగైన వైద్యం అందిచాలని వైద్యులను కోరారు.

# వైభవంగా కొనసాగుతున్న వినాయక నిమజ్జన వేడుకలు





**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్లలో వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా కొనసాగు తున్నాయి. సిరిసిల్ల మానేరు తీరంలోని బ్రిడ్జి వద్ద, ప్రేమ్ నగర్ లో నిమజ్జనానికిఅధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్రను శనివారం కలెక్టర్ సందీప్ కుమార్ , ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి పరిశీలించారు. నిమజ్జన స్థలం వద్ద అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యాజిక్, మిమిక్రీ షో భక్తులను అలరించింది. పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది బీఆర్ఎస్ కుంగింది వారి హయంలోనే



కొందరు కాళేశ్వరం లేకుంటే నీళ్లు లేవని ఫ్లెక్సీలు కడుతున్నారు

కుంగిన మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్ ఫోటోలు ఫ్లెక్సీలో కట్టాలి

మేడిగడ్డ పనిచేయకపోయినా అన్ని ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయి.

ఆ ప్రాజెక్టు వద్ద నీళ్లు నిలిపితే ఎన్నో గ్రామాలు ముంపునకు గురవుతాయి.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్ మండలం అగ్రహరంలోని శ్రీ కన్వెన్షన్ లో మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజి కింద

- 1550 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ

హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్

**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది బీఆర్ఎస్ అని.. కుంగింది వారి హయాంలోనేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు.

వేములవాడ అర్బన్ మండలం అగ్రహరంలోని ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితులు 1550 మందికి ప్రత్యేక ప్యాకేజి కింద ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఆదివారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు.ఎలబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం 5 లక్షలు ఇస్తానని మోసం చేసిందని విమర్శించారు. దాని పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శ్రీదర్ బాబు,పొన్నం ప్రభాకర్, వంటి అనేక మందితో కలసి నిరసనలు చేశామని పేర్కొన్నారు.వెనుకబడిన వేములవాడ ను అభివృద్ధి చేయాలని అనేక ధర్నా లు చేశామని తెలిపారు.

నేడు ప్రజా ప్రభుత్వంలో వెనుకబడిన వేములవాడ ను ముందుకు తీసుకెళు న్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇతర మంత్రులు ఈ ప్రాంత అభివృద్ధికి మద్దతుగా నిలుస్తున్నారని వివరించారు. రూ.240 కోట్లతో ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇల్లు మంజూరు చేశామని వెల్లడించారు. ప్రత్యేక ప్యాకెజి కింద ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇళ్ళు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.అందరికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు.18 సంవత్సరాల వయసు దాటిన వారి సమస్యలు త్వరలోపరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు

సమస్యల పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారుమిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణములో నిర్వాసితులైన 9 గ్రామాలలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 1,550 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశామని, ఒక్కో ఇంటికి రూ. ఐదు లక్షల చొప్పున లబ్ధి చేకూరనున్నదని తెలిపారు.గత మే మాసములో దాదాపు 389, ప్రత్యేక కోటా కింద 950, ప్రస్తుతం 1550 తో కలిపి 2889 ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని విప్.వెల్లడించారు.అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇది నిరంతర ప్రక్రియనే స్పష్టం చేశారు. అర్హులు ఎవరు ఆందోళన చెందవద్దని, అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. కష్టాలు ఉన్న వారి వెంట కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు కొందరు కాళేశ్వరం లేకుంటే నీళ్లు లేవని ఫ్లెక్సీలు కడుతున్నారని, వాళ్ళను ఏమనలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కాలేశ్వరం లోని మేడిగడ్డ వద్ద అసలు నీరే ఆపలేదని, అన్నారం సుందిళ్ల వద్ద బొంగలు పడి చుక్క నీరు నిలవలేదని తెలిపారు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు సమగ్ర విచారణ జరిపి నీరు నిలిస్తే ప్రమాదమని రిపోర్ట్ ఇచ్చారని,నీళ్లు ఆపడం వల్ల కింద గల 40 గ్రామాలతో పాటు భద్రాచలానికి ఇబ్బంది తలెత్తుతుందని అధికారులు తెలిపారని స్పష్టం చేశారుబీఆర్ఎస్ హయాంలో కట్టిన .ప్రాజెక్టు.. వారి హయాంలోనే కృంగిపోయింది దేశ చరిత్రలోనే ఇలాంటి ఘటన ఎప్పుడు జరగలేదని గుర్తు చేశారు.ప్రాజెక్టులో చుక్క నీరు ఆపకున్న కొందరు రాజకీయ పబ్బం పబ్బం గడుపుకునేదుకు, రైతులను తప్పుదోవ పట్టించడానికి కొందరు ఫ్లెక్సీలు అక్కడక్కడ ఫ్లెక్సీలు కడుతున్నారని విమర్శించారు. వాటిని చూసిన ప్రజలే ముక్కున వేలేసుకుంటున్నారని వివరించారు.ఆనాడు వైస్ రాజశేఖర్ రెడ్డి కట్టిన ఎల్లంపల్లి,కాంగ్రెస్ పార్టీ కట్టిన శ్రీరాం సాగర్ ప్రోజెక్ట ద్వారా నీళ్లు వస్తున్నాయని తెలిపారు.రంగురంగుల బ్రోచర్లు తయారు చేయడంలో.మిడ్ మానేరు,ఎల్ఎండికి, ఎల్లంపల్లి నుండి వరద కాలువకు ఎస్సారెస్పీ నుండి నీళ్లు వస్తున్నాయని స్పష్టం చేశారు. రంగురంగుల బ్రోచర్లు తయారు చేయడంలో ఫ్లెక్సీలు కట్టడంలో ఆ పార్టీ వారు ఆరితేరారని, రైతులారా ప్రజలారా బిఆర్ఎస్ వారు అల్లే కట్టు కథలను నమ్మవద్దని సూచించారు.గతంలో వేములవాడ దేవస్థానం అభివృద్ధి చేయకుండా బ్రిడ్జి నిర్మాణం చేయకుండా చేసినట్లుగా రంగురంగుల బ్రోచర్లతో ప్రజలను మభ్య పెట్టారని గుర్తు చేశారు. నేడు ప్రజా ప్రభుత్వం లో వేములవాడ పట్టణం దేవస్థానం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు.

ప్రజలను తరలించి కుంగిన ప్రాజెక్ట్ లు చూపెట్టాలిగతంలో ప్రజలను బస్సుల్లో తరలించి కాలేశ్వరం ప్రాజెక్టు చూపించినట్టుగా,నేడు కూడా బస్సుల్లో ప్రజలను తరలించి కుంగిన మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలను చూపెట్టాలనీ పేర్కొన్నారు అప్పుడు వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని స్పష్టం చేశారు.కుంగిపోయిన మేడిగడ్డ, ఇసుక దిబ్బలో కింది నుండి వెళ్తున్న అన్నారం సుందిళ్ల ఫోటోలను గ్రామాల్లో కట్టండి అని సూచించారు. పి సి గోస్ కమిషన్ విచారణ చేపట్టి కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెప్పారని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కాలేశ్వరం ప్రాజెక్టుపై చర్చించి సిబిఐ ఎంక్వైరీ వేస్తామని ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.కాలేశ్వరం నీరు చుక్క వాడకుండానే ఉమ్మడి రాష్ట్రంలో కంటే గత సంవత్సరం రెండు లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామని వెల్లడించారు.ప్రాజెక్టులోకి వస్తున్న ప్రతి చుక్క నీరు యధావిధిగా సముద్రంలోకి వెళ్తుందని విప్ వివరించారు.లి

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు ఇచ్చిన నివేదికను కూడా బీఆర్ఎస్ వారు తప్పుపడుతున్నారని చెప్పారు.వారు మద్దతిస్తేనే వారి హయాంలో లోక్ సభలో నేషనల్ డ్యాన్స్ సేఫ్టీ సంస్థ ఏర్పడిందని గుర్తు చేశారు.

## అగ్రహారం జేఎన్టీయూ విద్యార్థుల రాస్తారోకో



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ వేములవాడ**

వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం జేఎన్టీయూ విద్యార్థులు బైఠాయించి రాస్తారోకా నిర్వహించారు. కాలేజీ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటివరకు స్వంత క్యాంపస్ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా ఇచ్చిన భవనానికి కూడా తాళం వేసినందువల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

క్యాంపస్‌లో సరైన సదుపాయాలు, ముఖ్యంగా ల్యాబ్‌లు లేకపోవడంతో ప్రాక్టికల్స్ కోసం కొండగట్టు జేఎన్టీయూకు వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిది గదుల్లోనే తరగతులు నడుస్తుండటంతో పాఠశాల వాతావరణం పూర్తిగా దెబ్బతిన్నదని వారు తెలిపారు.

అదనంగా, హాస్టల్ నుండి కాలేజీకి ప్రతిరోజూ రెండు కిలోమీటర్లు నడుస్తూ రావాల్సి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. తక్షణమే శాశ్వత క్యాంపస్‌తోపాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

## అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ఆదేశించి



**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 154 వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 49, డీఆర్డీఓకు 32, గృహ నిర్మాణ శాఖకు 14, జిల్లా విద్యాధికారి కార్యాలయం 13, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 11, ఉపాధి కల్పన శాఖకు 7, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి ఐదు, ఎస్డీసీ, డీసీఎస్ఓ కు మూడు చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, ఎస్పీ ఆఫీస్, ఈఓ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రెండు చొప్పున, ఎస్సీ కార్పొరేషన్, ఏడీ ఎస్ఎల్ఆర్, జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీ మైన్స్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారి, ఈఈ పీఆర్, డీఐఈఓ, ఎల్డీఎం, మార్కెటింగ్ శాఖకు ఒకటి చొప్పున వచ్చాయి..కార్యక్రమంలో గడ్డం నగేష్, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 17వ పోలీస్ బెటాలియన్,సర్దాపూర్



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ పోలీస్ బెటాలియన్ సర్ధాపూర్ లోని పాత టైర్లు, బ్యాటరీలు మరియు పాత ఇతర సామాన్లను తేది: 09-09-2025నుండి 10-09-2025 వరకు 10:30 కి బెటాలియన్ హెడ్ క్వార్టర్స్ లో వేలం వేయనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ ఎం ఐ. సురేష్ గారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు 8712657570
96526 08026
ఫోన్ నంబరు లను సంప్రదిస్తే పూర్తి వివరాల కోసం బెటాలియన్ సిబ్బంది తెలుజేస్తారని పేర్కొన్నారు.

# ప్రశాంతంగా సాగిన వినాయక విగ్రహాల నిమజ్జనం



ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా నిమజ్జన ప్రక్రియ పూర్తి

శోభాయాత్రలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు,డ్రోన్ కెమెరాలతో నిఘా

క్షేత్ర స్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తించిన సిబ్బందిని , అధికారులను అభినందించిన ఎస్పీ

**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిద్దుల ప్రతినిధి**

జిల్లాలోని.సిరిసిల్ల,వేములవాడ పట్టణాలతో పాటుగా మండల కేంద్రాల్లో నిర్వహించిన వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా పూర్తి.జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరిగేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నిమజ్జనం విజయవంతంగా, ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు ఎస్పీ ఈసందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి స్పందన



**10 మంది హాజరు, ఆపరేషన్‌కు 38 మంది ఎంపిక**

**ఉచితంగా ఆపరేషన్, మందులు, అద్దాలు, భోజనం ఉచితం**

**శిబిరానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు**

**లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్**

**మే కార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి**

రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి స్పందన వచ్చింది. వేములవాడ పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్ లో ఉదయం 09.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు శిబిరం నిర్వహించారు. డాక్టర్లు చింతల ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ బృందం ఆధ్వర్యంలో 110 మందికి రక్త, కంటి పరీక్షలు చేయగా, 38 మంది ఆపరేషన్ కు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడారు. కంటి ఆపరేషన్ చేయించుకునే వారిని వేములవాడ నుంచి రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచితంగా బస్సులో తీసుకువెళ్లి, మళ్లీ తీసుకువస్తామని తెలిపారు. ఆపరేషన్ చేసిన తర్వాత ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇస్తారని, బోజన సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు.ఈ వైద్య శిబిరానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో లయన్ బచ్చు వంశీకృష్ణ, లయన్ డాక్టర్ కోయినేని ప్రవీణ్, వైద్యులు, పాల్గొన్నారు.

